సర్కారు అబద్ధాలు.. వేముల కౌంటర్

25 వేల టీచర్ పోస్టుల భర్తీ ఏమైంది?

- విద్యకు అతి తక్కువ నిధులు
- 7.51% నిధులే కేటాయింపు
- 1,913 పాఠశాలల మూత
- తగ్గిన 3.06లక్షల స్టూడెంట్స్
- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే సబిత

హైదరాబాద్, మార్చి 25 (నమస్తే తెలంగాణ): 'నాడు పీసీసీ చీఫ్‌గా ఉన్న రేవంత్‌రెడ్డి 25 వేల టీచర్ పోస్టుల ఖాళీగా ఉన్నాయని ఆనాడు ట్వీట్ చేశారు. మరి అధికారంలోకి వచ్చాక 11 వేల ఉద్యోగాలనే భర్తీచేశారు. అంటే 25 వేల టీచర్ పోస్టులు ఇస్తామన్న మాట తప్పారు' అని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో విద్యాశాఖ పద్దుపై జరిగిన చర్చలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక విద్యాశాఖ పట్ల నిర్లక్ష్యం బట్టబయలైందని పేర్కొన్నారు. బడ్జెట్‌లో విద్యాశాఖకే అతి తక్కువ నిధులు కేటాయించారని, కేవలం 7.51% నిధులే కేటాయించారని విమర్శించారు. సర్వశిక్ష అభియాన్‌లో రాష్ట్ర ప్రభుత్వం వాటా కింద రూ.160 కోట్లు చెల్లించకపోవడం వల్ల కేంద్రం నుంచి రావాల్సిన రూ.250 కోట్ల నిధులు (60%)ఆగిపోయాయని తెలిపారు. సీఎం రేవంత్ వద్దే విద్యాశాఖ ఉన్నదని, కేంద్రం నిధులు జమ చేయకపోతే మరి వైఫల్యం ఎవరిదని ప్రశ్నించారు. 1913 పాఠశాలలు జీరో ఎన్‌రోల్‌మెంట్ పేరుతో మూసివేశారని, 400 పాఠశాలల్లో రేషనలైజేషన్ అని టీచర్లందరినీ వేరే ప్రాంతాలకు తరలించారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పాఠశాలల్లో 3,60,000 మంది విద్యార్థులు తగ్గారని తెలిపారు. కాంగ్రెస్ తెచ్చిన మార్పు ఇదేనా అని ప్రశ్నించారు.

భోజన కార్మికులకు 10 వేలివ్వండి

మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10 వేల చొప్పున వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇదే అంశాన్ని గతంలో కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పెట్టారని గుర్తుచేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్‌ను పునఃప్రారంభించాలని డిమాండ్ చేశారు.

అసెంబ్లీలో కడిగిపారేసిన ప్రశాంత్‌రెడ్డి

అన్నింటినీ లెక్కలతో వివరించడంతో నోరెళ్లబెట్టిన అధికార పక్షం

అంతరాయం కలిగించినా తగ్గని వైనం

హైదరాబాద్, మార్చి 25 (నమస్తే తెలంగాణ) : మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి కాంగ్రెస్‌కు అసెంబ్లీలో ముచ్చెమటలు పోయించారు. సర్కార్ చెప్పిన అబద్ధాలపై ఏకిపారేస్తూనే పదేండ్లల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన ప్రగతిని కండ్లకు కట్టినట్టు వివరించారు. మంగళవారం రోడ్లు భవనాలు, టూరిజం ఎక్సైజ్ శాఖల పద్దులపై చర్చలో సాధికారిక ఆధారాలు, అంకెలు, లెక్కలు, ఫొటోలతో సహా వివరించారు. డిప్యూటీ సీఎం భట్టి , మంత్రులు శ్రీధర్‌బాబు, జూపల్లి, కోమటిరెడ్డి పదేపదే అడ్డుతగులుతూ వేములను నిలువరించే ప్రయత్నం చేసినా వెనక్కి తగ్గలేదు. అరుపులు, కేకలు వద్దని, రన్నింగ్ కామెంటరీ చేయవద్దని అధికార పక్షానికి చురకలంటించారు. ఎక్సైజ్ ద్వారా అదనంగా 12 వేల కోట్ల ఆదాయం సమకూర్చుకోవడం దారుణమని, మ్యానిఫెస్టోలో చెప్పినట్టు బెల్ట్‌షాప్‌లను తొలగించాలని పేర్కొన్నారు.

సర్కారు అబద్ధం : రోడ్ల మీద బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ. 8,112 కోట్లే ఖర్చుచేసింది. దీంట్లో రూ. 4167 కోట్లు అప్పుతెచ్చింది.

ప్రశాంత్‌రెడ్డి కౌంటర్ : ఇది పూర్తిగా అవాస్తవం. ప్లాన్‌లో 2014 నుంచి 2024 వరకు రూ. 8,821 కోట్లు, ఆర్డీసీ నుంచి రుణం తీసుకొని రూ.4,167 కోట్ల చొప్పున రూ.12,988 కోట్లు కేవలం రోడ్ల మీద ఖర్చుపెట్టినం. ఇక నాన్ ప్లాన్ రిపేర్లు, కల్వర్టులు, రెన్యువల్స్‌లో రూ. 3,375 కోట్లు నేరుగా బడ్జెట్ నుంచి రూ. 257 కోట్లు డీఎంఎఫ్‌టీ నుంచి ఖర్చుచేసినం. పదేండ్లలో నాన్ ప్లాన్‌లో మరో రూ. 3632 కోట్లు ఖర్చుచేసినం. ఈ ఒక్క విభాగం నుంచే రూ.16,621 కోట్లతో రోడ్లను అభివృద్ధి చేసినం. రూరల్ రోడ్స్ విభాగంలో రూ.1022 కోట్లు, సీఆర్‌ఐఎఫ్ ద్వారా రూ. 2519 కోట్లు ఖర్చుపెట్టినం. రూ. 22,180 కోట్లు విడుదల చేసినం. భవనాల నిర్మాణానికి రూ. 2,652 కోట్లు పెట్టి నం. రూ. 20,625 కోట్లు బడ్జెట్ ద్వారానే ఖర్చుచేసినం. రోడ్లు, భవనాల పనులకు 24,832 కోట్లు ఖర్చు చేసినం. ఎన్‌హెచ్‌ల మీద 8 వేల కోట్లు ఖర్చుచేసినం. అన్నీ కలిపితే రూ. 32,832 కోట్లు. అప్పులు రూ.4,167 కోట్లు మాత్రమే.

సర్కారు అబద్ధం : పదేండ్లల్లో ఒక్క గుంత కూడా పూడ్చలేదు. 6,628 రిపేర్లు చేశారు.

ప్రశాంత్‌రెడ్డి కౌంటర్ : గతంలో డబుల్ రోడ్లు 6,903 కి. మీ మాత్రమే ఉండేవి. బీఆర్‌ఎస్ పాలనలో 8,439 కి. మీ రోడ్లను సింగిల్ లేన్ నుంచి డబుల్ లేన్‌కు మార్చినం. 60 ఏండ్లల్లో ఉన్నదానితో పోల్చితే పదేండ్లలోనే అత్యధికంగా రోడ్లు వేసినం. ఫోర్ లేన్ రోడ్లు ఇది వరకు 669 కి. మీ మాత్రమే. మేం కొత్తగా 485 కిలోమీటర్ల ఫోర్‌లేన్ రోడ్లు వేసినం

సర్కారు అబద్ధం : ఎన్‌హెచ్‌లు వేయలేదు.. కొత్త వాటిని పట్టించుకోలేదు.

ప్రశాంత్‌రెడ్డి కౌంటర్: ఇది వరకు 2,511 కి.మీ ఎన్‌హెచ్‌లుంటే బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో 2,472 కిలోమీటర్లను అదనంగా చేర్చినం.

సర్కారు అబద్ధం : మీరు భవనాలు కట్టామంటున్నరు. మీరు కట్టుకుంటే మేం ఇండ్లల్లో పెట్టుకున్నమా?

ప్రశాంత్‌రెడ్డి కౌంటర్ : 60 ఏండ్లల్లో కట్టింది 32 లక్షల చదరపు ఫీట్లు మాత్రమే. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో కోటి చదరపు ఫీట్ల కొత్త భవనాలు కట్టినం. మొత్తం 1.32 కోట్ల స్క్వేర్ ఫీట్ల ఆర్‌అండ్‌బీ భవనాలున్నయి. సచివాలయం, కమాండ్ కంట్రోల్ రూం, అంబేద్కర్ విగ్రహ సముదాయం, యాదాద్రి ఆలయం, 30 జిల్లాల్లో కలెక్టరేట్లు, 90కిపైగా ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులు కట్టినం.

సర్కారు అబద్ధం : సెంట్రల్ రోడ్ అండ్ ఇన్‌ఫ్రా ఫండ్ (సీఐఆర్‌ఎఫ్) నుంచి రాష్ట్రానికి రూపాయి కూడా తేలేదు. ఒక్క రోడ్డును కూడా అభివృద్ధి చేయలేదు.

ప్రశాంత్‌రెడ్డి కౌంటర్ : 2014 నుంచి 2024 వరకు ప్రతి ఏడాది సీఐఆర్‌ఎఫ్ నుంచి నిధులు తెచ్చినం. 2014-15లో రూ.51 కోట్లు, 2015-16లో రూ.135 కోట్లు, 2016లో రూ.280 కోట్లు , 2017లో రూ. 249 కోట్లు, 2018లో రూ.279 కోట్లు, 2019-20లో రూ.234 కోట్లు, 2020-21లో రూ.253 కోట్లు, 2021-22లో రూ.261 కోట్లు, 2022-23లో రూ.275 కోట్లు, 20 23-24లో రూ.345 కోట్ల చొప్పున 2,369 కోట్లను కేంద్రం నుంచి తెచ్చి రూ.2,519 కోట్లు ఖర్చు పెట్టినం. కేంద్రం ఇచ్చినదానికంటే మేం అదనంగా ఖర్చుచేసినం. కాంగ్రెస్ వచ్చాక కేంద్రం నుంచి రూ. 283 కోట్లు తెచ్చి రూ.256 కోట్లే ఖర్చు చేసింది.

సర్కార్ అబద్ధం : సీఐఆర్‌ఎఫ్ నుంచి మేం రూ.850 కోట్లు తెచ్చినం. పనులు మంజూరయ్యాయి. 50 శాతం పనులు పూర్తయ్యాయి.

ప్రశాంత్‌రెడ్డి కౌంటర్ : రూ. 850 కోట్లు మంజూరైనట్టు తెలియదు. నేను మంజూరు పనుల గురించి మాట్లాడటం లేదు. 2024-25లో సీఐఆర్‌ఎఫ్ నుంచి ఖర్చుచేసింది రూ. 283 కోట్లే. గతంలో సీఆర్‌ఐఎఫ్ నుంచి రూ.850 కోట్లు తెచ్చినమన్నరు. ఈ రోజేమో మంజూరు చేసినమంటున్నరు. ఇదేం విధానమో? అర్థం కావడంలేదు.

సర్కారు అబద్ధం : ఉప్పల్ ఫ్లైఓవర్ బీఆర్‌ఎస్ నిర్లక్ష్యంతోనే ఆగిపోయింది. 2017 నుంచి పట్టించుకోలేదు.

ప్రశాంత్‌రెడ్డి కౌంటర్ : ఉప్పల్ ఫ్లై ఓవర్ నేషనల్ హైవే ప్రాజెక్టు. కాంట్రాక్ట్, పూర్తిచేసే బాధ్యత కేంద్రానిదే. 2017లో పట్టించుకోలేదన్నది అబద్ధం. గెజిట్ వచ్చిందే 2017లో. 2018లో పనులు మొదలయ్యి రెండు, మూడు సంవత్సరాలు కొనసాగాయి.

సర్కార్ అబద్ధం : ఉప్పల్ ఫ్లై ఓవర్‌కు ఎస్క్రో అకౌంట్ ఓపెన్ చేయలేదు.

ప్రశాంత్‌రెడ్డి కౌంటర్ : నేను మంత్రిగా ఉన్నప్పుడు పనులు స్లోగా నడుస్తున్నాయేందని సమీక్షిస్తే కాంట్రాక్టర్‌కు పనులు చేయడం ఇష్టంలేదని, వచ్చిన డబ్బును వేరే పనులకు మళ్లిస్తున్నట్టు తేలింది. 28 ఏప్రిల్ 2022లో ఎస్క్రో అకౌంట్ ఓపెన్ చేసినం. అకౌంట్ ఓపెన్ చేసిన డాక్యుమెంట్ ఇదిగో.. (కాపీ సభలో చూపుతూ). మీరు వచ్చి 15 నెలలైంది. మరి పనులు ప్రారంభమైనయా?

సర్కారు అబద్ధం : ట్రిపుల్ ఆర్ ప్రాజెక్టు 2017లో ఆగిపోయింది. బీఆర్‌ఎస్ పట్టించుకోలేదు. కేంద్రాన్ని అడగలేదు.

ప్రశాంత్‌రెడ్డి కౌంటర్ : అసలు ట్రిపుల్ ఆర్ ప్రాజెక్ట్‌కు అంకురార్పణ చేసిందే కేసీఆర్. ఇప్పుడున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు కేసీఆర్‌తో కలిసి అనేకసార్లు ఢిల్లీకి వెళ్లారు. (గడ్కరీని కలిసిన ఫొటోలు చూపిస్తూ) దేశంలో మేమే మొదటిసారిగా భూసేకరణకు అయ్యే వ్యయంలో 50 శాతం భరిస్తామని చెప్పినం. 2015 నుంచి తిరిగితే 2021 డిసెంబర్‌లో అలైన్‌మెంట్ ఖరారు చేశారు. మేం 100 కోట్లు డిపాజిట్ చేసినం. 2017లోనే అంగీకారం తెలిపితే 2017లోనే ఆగిపోయిందనడం అవాస్తవం. 2024, డిసెంబర్ 28న టెండర్లు పిలిచారు. ఆగిపోయాయి. మళ్లీ ఇంత వరకు టెండర్లు పిలవలేదు. ఈ 15 నెలల్లో ఏం చేశారో చెప్పాలి. దక్షిణ భాగానికి మేం అలైన్‌మెంట్ ఖరారు చేసినం. ఆ అలైన్‌మెంట్ ఎందుకు మారుస్తున్నారో చెప్పాలి. అలైన్‌మెంట్‌కు కేంద్రం ఒప్పుకోకపోతే 15 వేల కోట్ల భారం పడుతది. ఈ బడ్జెట్‌లో 3 వేల కోట్ల 1500 కోట్లే కేటాయించారు.

సర్కారు అబద్ధం : హ్యామ్‌లో భాగంగా 17 వేల కిలో మీటర్లు పూర్తిచేస్తాం. 28 వేల కోట్లు ఖర్చుచేస్తాం.

ప్రశాంత్‌రెడ్డి కౌంటర్ : బడ్జెట్ కాపీలోనేమో 17 వేల కిలోమీటర్లు హ్యామ్ ద్వారా చేపడుతున్నట్టు పేర్కొన్నారు. కానీ బడ్జెట్ పద్దుల్లోనేమో 12 వేల కిలోమీటర్లు అని ఇచ్చారు. పోనీ 12 వేల కిలోమీటర్లు పూర్తిచేయాలంటే రూ.19,760 కోట్లు కావాలి. ఈ మొత్తానికి ప్రభుత్వ వాటాగా రూ. 7,904 కోట్లు బడ్జెట్ నుంచి ఇవ్వాలి. ఇదిలా ఉంటే మూడేండ్లల్లో ఈ ఏడాది 4,600 కిలోమీటర్లు పూర్తిచేయాలంటే ప్రభుత్వ వాటాగా రూ. 3,029 కోట్లు కేటాయించాలి. కానీ బడ్జెట్ పద్దుల్లో రూ.500 కోట్లే పెట్టారు. ఈ హ్యామ్ మోడల్ ఎవరికోసం? మీరు చెప్పేది ఎలా నమ్మాలి?

నా పార్థివదేహంపై జాతీయజెండా కప్పతారు

ప్రశాంత్‌రెడ్డి భావోద్వేగానికి గురయ్యారు. 'నేను చనిపోతే నా పార్థివదేహంపై జాతీయ జెండా కప్పుతారు. అతి కొద్దిమందికి దక్కే గౌరవాన్ని నేను పొందాను. కేసీఆర్ ఆశీర్వాదంతో మూడుసార్లు ఎమ్మెల్యేనయ్యాను. నాలుగేండ్లు మిషన్ భగీరథ వైస్‌చైర్మన్‌గా, ఐదేండ్లు మంత్రిగా పనిచేశాను. భగవంతుడు ఇచ్చిన శక్తి మేరకు రాష్ట్ర ప్రజలకు సేవ చేసుకున్నాను. ఎవరు కించపరిచినా, నేను వాస్తవాలే మాట్లాడుతా' అని భావోద్వేగానికి లోనయ్యారు.

తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్‌ది కీలకపాత్ర

- బీఆర్‌ఎస్ వంద శాతం చేసింది.. కానీ చేయాల్సినంత చేయలేదు
- మంత్రి జూపల్లి వెల్లడి

హైదరాబాద్, మార్చి 25 (నమస్తే తెలంగాణ): 'తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ పాత్ర ప్రముఖంగా ఉంది. ఆయనే ఉద్యమాన్ని నడిపించారు. ఇందులో ఎలాంటి సందేహం లేదు' అని మంత్రి జూపల్లి కృష్ణారావు అసెంబ్లీ సాక్షిగా స్పష్టం చేశారు. మాజీ మంత్రి కేటీఆర్ ప్రసంగం అనంతరం మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ పాత్రతోపాటు.. తెలంగాణ రావడంలో సోనియాగాంధీ పాత్ర కూడా ఉందని ఆయన తెలిపారు. '1960లో వందల మంది చనిపోయినా తెలంగాణ రాలేదు. బీజేపీ పాలనలో కూడా తెలంగాణ రాలేదు. ఉద్యమం జోరుగా సాగుతున్న తరుణంలో వందలాది మంది చనిపోతున్నారని సోనియాగాంధీ ఓ తల్లిగా మానవీయ కోణంలో తెలంగాణ ఇచ్చారు. 'మీ పాత్ర (బీఆర్‌ఎస్-కేసీఆర్) లేదనలేదు. ఆమె పాత్ర కూడా ఉంది' అని స్పష్టం చేశారు. 'మీరు పనులేమీ చేయలేదని నేను అనలేదు. వంద శాతం చేశారు. కానీ, చేయాల్సినవన్నీ చేయలేదు' అంటూ మంత్రి జూపల్లి తడబడ్డారు. 'టూంబ్స్ చేశారు. మొజంజాహీ మార్కెట్ అభివృద్ధి, బుద్ధ వనం.. అన్నీ చేశారు. నేను కాదనలేదు. కొల్లాపూర్‌లో కూడా బాగానే చేశారు' అని చెప్పారు. అంబేద్కర్ విగ్రహం గేటు తాళాలు తీస్తామని, అక్కడ గ్రంథాలయం ఏర్పాటు చేయాలనుకుంటున్నట్టు మంత్రి తెలిపారు. అమరవీరుల స్థూపాన్ని కూడా పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్ పాలనలో 26 వేల టీచర్ పోస్టుల భర్తీ

- టీచర్స్ రిక్రూట్‌మెంట్ చేయలేదని అసెంబ్లీలో కాంగ్రెస్ అబద్ధాలు
- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్ ఫైర్

హైదరాబాద్, మార్చి 25 (నమస్తే తెలంగాణ): 'బీఆర్‌ఎస్ పాలనలో 26 వేల టీచర్ పోస్టులు భర్తీచేశాం. పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా 8 వేలు, గురుకులాల్లో 18 వేల నియామకాలు చేశాం' అని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పష్టంచేశారు. కానీ, కాంగ్రెస్ సభ్యులు టీచర్ పోస్టులు భర్తీ చేయలేదని అసెంబ్లీ సాక్షిగా అబద్ధాలు చెబుతున్నారని ఆక్షేపించారు. మంగళవారం శాసనసభలో విద్యాశాఖ పద్దుపై చర్చ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడారు. మంత్రి శ్రీధర్‌బాబు తన పేరు తీసుకొని మాట్లాడారని, అందుకే వాస్తవాలు వెల్లడిస్తున్నానని, సభ రికార్డులను సవరించాలని స్పీకర్‌కు విజ్ఞప్తిచేశారు. కాంగ్రెస్ వచ్చిన తర్వాత ఎన్ని స్కూళ్లు మూతపడ్డాయని మా సభ్యురాలు అడిగితే మంత్రి శ్రీధర్‌బాబు 79 స్కూళ్లు తెరిపించామని చెబుతున్నారు. కానీ, మూతపడ్డ 1,913 స్కూళ్ల గురించి ఎందుకు మాట్లాడడం లేదని సూటిగా ప్రశ్నించారు.

గతంలో అసెంబ్లీ సమావేశాలపై ఆసక్తి

- నేడు బట్టలు విప్పడు, కత్తులు దూసుడే కనిపిస్తున్నది
- మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు

మల్లారెడ్డి, వివేక్ మధ్య సరదా సంభాషణ..

అసెంబ్లీ లాబీలో మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి మధ్య సరదా సంభాషణ కొనసాగింది. ఒకరిపై ఒకరు చలోక్తులు విసురుకున్నారు. వివేక్‌ను 'నమస్తే మంత్రి గారు' అని మల్లారెడ్డి పలుకరించగా, దీనికి స్పందించిన వివేక్.. థ్యాంక్స్ మల్లన్నా అంటూ సమాధానమిచ్చారు. అనంతరం మల్లారెడ్డి.. రాష్ట్రంలో కోమటిరెడ్డి, వెంకటస్వామి ఫ్యామిలీల హవా నడుస్తున్నదని అన్నారు. వివేక్ స్పందించి.. బీఆర్‌ఎస్ హయాంలో కేసీఆర్, మల్లారెడ్డిదే నడిచిందిగా.. అని జవాబిచ్చారు. దీనికి మేము అధికారం కోల్పోయాం.. మాదేం లేదన్నా అని మల్లారెడ్డి రిప్లై ఇవ్వడంతో ఇద్దరి మధ్య నవ్వులు విరిచాయి.

హైదరాబాద్, మార్చి 25 (నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ లాబీలో మంగళవారం మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ సమావేశాలపై ఆయన పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గతంలో పార్లమెంట్‌లో వాజపేయి లాంటి వారు మాట్లాడుతుంటే ప్రజలు ఆసక్తిగా చూసేవారని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ చంద్రబాబు, రాజశేఖర్‌రెడ్డి లాంటి నాయకులు సభలో మాట్లాడుతుంటే ప్రజలు టీవీలకు హత్తుకుపోయేవారని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అసెంబ్లీలో కేసీఆర్ ఏం మాట్లాడుతారోనని ఆసక్తి ఉండేదని, కానీ ప్రస్తుతం అసెంబ్లీలో 'బట్టలు విప్పుడు, కత్తులు దూసుడే' కనిపిస్తున్నదని వ్యాఖ్యానించారు.

నేను ఏదైనా ఫేస్ చేయడానికి సిద్ధం

అసెంబ్లీ లాబీలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి

హైదరాబాద్, మార్చి 25 (నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ లాబీలో డిప్యూటీ సీఎం భట్టి చాంబర్ వద్ద వరంగల్ జిల్లాకు చెందిన మాజీ మంత్రులు కడియం శ్రీహరి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఎదురుపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మొదటిసారి అసెంబ్లీకి వచ్చినట్టు ఎర్రబెల్లి డిప్యూటీ సీఎం భట్టితో అన్నారు. స్పందించిన భట్టి విక్రమార్క 'అదేంది అన్నా.. మీరందరూ రావాలి.. ఇది ప్రజా ప్రభుత్వం' అని చెప్పారు. ముఖ్యమంత్రికి మీరైనా చెప్పి దేవాదుల నీళ్లు ఇప్పించాలని కడియం శ్రీహరిని ఎర్రబెల్లి దయాకర్ కోరారు. ఇదే విషయంపై ఎర్రబెల్లితో పాటు చల్లా ధర్మారెడ్డి కడియంతో మాట్లాడుతుండగా.. అక్కడికి వచ్చిన జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి.. ఆయనతో ఎంటి మాట్లాడేదని అన్నారు. ఎమ్మెల్యేల అనర్హత అంశం చర్చకు రాగా.. 'నేను ఏదైనా ఫేస్ చేయడానికి సిద్ధంగా ఉన్నా.. ఎర్రబెల్లి దయాకర్ మీ అందరి ముందు ఏం మాట్లాడినా.. తర్వాత నాతో మళ్లీ ఫోన్ చేసి ఏం మాట్లాడాలో అదే మాట్లాడుతారు' అని కడియం అనడంతో అక్కడున్న వారంతా ఆశ్చర్యపోయారు.

మంత్రి వర్గ విస్తరణలో బంజారాలకు అవకాశం ఇవ్వాలి

బంజారా సంఘం, బంజారా ఉద్యోగుల సంఘం డిమాండ్

హైదరాబాద్, మార్చి 25 (నమస్తేతెలంగాణ): రాష్ట్ర మంత్రి వర్గ విస్తరణలో బంజారాలకు అవకాశం కల్పించాలని బంజారా సంఘం, బంజారా ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా బంజారా సంఘం, బంజారా ఉద్యోగుల నేతలు కాంగ్రెస్ వైఖరిపై మండిపడ్డారు. బంజారా ఉద్యోగుల సంఘం తెలంగాణా రాష్ట్ర కన్వీనర్ మాలోత్ దశరథ్‌నాయక్ మాట్లాడుతూ.. రాష్ట్ర జనాభాలో 10 శాతం లంబాడీ గిరిజనులు ఉన్నారని, ఒక్క శాతం కూడా లేని ఆదివాసీ గిరిజనుల్లోని ఇతర కులాలవారికి మంత్రివర్గంలో అవకాశం కల్పించి, 10శాతం ఉన్న బంజారాలను విస్మరించడం తగదని హితవు పలికారు. రాష్ట్రంలో 38 లక్షల మంది బంజారాలు ఉన్నారని, వారి ప్రాతినిథ్యం కోసం అధికార పార్టీలో ఉన్న సీనియర్లకు మంత్రివర్గంలో చోటు కల్పించాలని కోరారు. దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్, డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రాంచందర్‌నాయక్, సీనియర్ ఎమ్మెల్యే నెహ్రూ నాయక్, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్‌లలో ఒకరికి మంత్రివర్గ కూర్పులో స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు.

మళ్లీ ప్రశ్నోత్తరాలు రద్దు

బీఆర్‌ఎస్ అభ్యంతరం

హైదరాబాద్, మార్చి 25 (నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ సమావేశాల్లో నిర్వహించే ప్రశ్నోత్తరాలను ఇప్పటికే మూడుసార్లు రద్దు చేసిన ప్రభుత్వం తాజాగా తొమ్మిదో రోజు నాలుగోసారి రద్దు చేసింది. దీంతో ప్రధాన ప్రతిపక్షం బీఆర్‌ఎస్ అభ్యంతరం వ్యక్తంచేసింది. మంగళవారం సభ ప్రారంభమయ్యాక స్పీకర్ రాకముందే సభలోకి వచ్చిన బీఆర్‌ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు, ఇతరులు క్వశ్చన్ అవర్ నిర్వహించాలని శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబును కోరారు. క్వశ్చన్ అవర్ లేదని మంత్రి సమాధానం చెప్పడంతో.. క్వశ్చన్ అవర్, జీరో అవర్‌ను ఎత్తివేస్తే సభ్యుల పరిస్థితి ఏంటని కేటీఆర్, హరీశ్‌రావు ప్రశ్నించారు. జీరో అవర్ ఎత్తివేస్తే ఏమో కానీ, ప్రతిరోజూ క్వశ్చన్ అవర్ ఎలా ఎత్తివేస్తారు? అని నిలదీశారు. ఈ లోగా స్పీకర్ సభలోకి రావడంతో సభ ప్రారంభమైంది. ఇప్పటికే మూడుసార్లు క్వశ్చన్ అవర్ రద్దు చేసిన స్పీకర్.. తాజాగా మరోసారి రద్దుచేస్తున్నట్టు ప్రకటించారు.

బీఆర్‌ఎస్ హయాంలో చదువులకు అగ్రస్థానం

- బడ్జెట్‌ను మించి విద్య వ్యయం
- కాంగ్రెస్ సర్కారులో వ్యయం అంతంతే మాత్రమే
- అసెంబ్లీలో ప్రకటించిన బడ్జెట్ పద్దు పుస్తకాల్లో వెల్లడి

హైదరాబాద్, మార్చి 25 (నమస్తే తెలంగాణ) : బీఆర్‌ఎస్ సర్కారు పాఠశాల విద్యకు అధిక ప్రాధాన్యం ఇచ్చింది. చదువులకు పెద్దపీట వేసింది. ఇందుకు బడ్జెట్ గణాంకాలే నిదర్శనంగా నిలుస్తున్నాయి. బడ్జెట్ కేటాయింపుల కంటే బీఆర్‌ఎస్ అధికంగా ఖర్చుచేసింది. అదే కాంగ్రెస్ సర్కారు బడ్జెట్ కేటాయింపుల కంటే తక్కువగా ఖర్చుచేయడం గమనార్హం. ఈ విషయాన్ని సాక్షాత్తు కాంగ్రెస్ ప్రభుత్వమే అసెంబ్లీలో ప్రకటించింది. బీఆర్‌ఎస్ హయాంలో బడ్జెట్ కేటాయింపులు, వ్యయం ఘనంగా ఉండగా, కాంగ్రెస్ పాలనలో ఖర్చు అధ్వానం అన్నట్టుగా పరిస్థితి తయారయ్యింది. మంగళవారం బడ్జెట్ పద్దు పుస్తకాల్లో ఇదే విషయాన్ని పొందుపరిచింది.

- 2022-23 విద్యాసంవత్సరంలో పాఠశాల విద్యకు బీఆర్‌ఎస్ సర్కారు రూ. 12,528.51కోట్లు కేటాయించింది. రూ.13,710.88 కోట్లు ఖర్చుచేసింది. అంటే బడ్జెట్ కేటాయింపుల కంటే అదనంగా రూ. 1,182.37 కోట్లు కేటాయించడం గమనార్హం.
- 2023-24 ఆర్థిక సంవత్సరంలో బీఆర్‌ఎస్ సర్కారు రూ. 14,488.25 కోట్లను బడ్జెట్‌లో కేటాయించింది. ఖర్చు విషయానికి వస్తే రూ. 14,523.40 కోట్లు ఖర్చుచేసింది. బడ్జెట్ కంటే రూ. 35.15 కోట్లు అధికంగా వెచ్చించింది.
- 2024-25 ఆర్థిక సంవత్సరంలో కాంగ్రెస్ సర్కారు పాఠశాల విద్యకు రూ. 15,591.30 కోట్లు బడ్జెట్‌లో కేటాయించగా, ఖర్చుచేసింది కేవలం రూ.15,169 కోట్లు మాత్రమే. అంటే బడ్జెట్‌లో కేటాయించినదానికంటే రూ. 421.8 కోట్లు తక్కువగా ఖర్చుచేసింది.
- 2024-25లో మాడల్ స్కూల్స్‌కు కాంగ్రెస్ సర్కారు నిర్వహణ పద్దు కింద.. రూ.475 కోట్లు కేటాయించగా, 2025 ఫిబ్రవరి వరకు రూ. 383 కోట్లు మాత్రమే ఖర్చుచేసింది.
- కొత్తగా 2025-26 ఆర్థిక సంవత్సరంలో పాఠశాల విద్యకు రూ. 16,387 కోట్లు కేటాయించింది. దీంట్లో మొత్తం ఖర్చుచేస్తుందా? అన్న అనుమానాలు విద్యావేత్తల నుంచి వ్యక్తమవుతున్నాయి.

స్పీకర్ సార్.. మీ వ్యాఖ్యలు బాధించాయి

- అసెంబ్లీలో ఆవేదన వ్యక్తంచేసిన ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి
- ఉపసంహరించుకుంటున్నట్టు ప్రకటించిన స్పీకర్

హైదరాబాద్, మార్చి 25 (నమస్తే తెలంగాణ): స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సోమవారం సభలో తనను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు బాధించాయని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. మంగళవారం అసెంబ్లీ ప్రారంభమైన తర్వాత సభలో తనను ఉద్దేశించి స్పీకర్ చేసిన వ్యాఖ్యలను ఆమె ప్రస్తావించారు. 'నాకే వినబుద్ధవడంలేదు. మీరెట్ల వింటున్నారు?' అని గౌరవ స్పీకర్ అనడం తనను బాధించిందని పేర్కొన్నారు. సోమవారం చర్చలో తానేం తప్పుచేశానని స్పీకర్‌ను ప్రశ్నించారు. తాను సబ్జెక్టు తప్ప పరిధి దాటి నడుచుకోలేదని, పార్లమెంటరీ సంప్రదాయాలకు విరుద్ధంగా వ్యవహరించలేదని స్పష్టంచేశారు. ఇదే సభలో ముఖ్యమంత్రి, మంత్రులు, సభ్యులెందరో మహిళా సభ్యులమైన తమ పట్ల అన్‌పార్లమెంటరీ భాష మాట్లాడినా, తాము సభలో నిలబడి మౌనంగా నిరసన వ్యక్తంచేశామే తప్ప ఎక్కడా అనుచితంగా ప్రవర్తించలేదని చెప్పారు. మంత్రిగా పనిచేసి, సీనియర్ శాసనసభ్యురాలిగా కొనసాగుతున్నానని, కొత్త ఎమ్మెల్యేలకు సూచనలు, సలహాలిచ్చే తన పట్ల స్పీకర్ మాట్లాడిన వ్యాఖ్యలు అత్యంత బాధించాయని పేర్కొన్నారు. తాను ఇప్పటివరకు ఎవరితోనూ మాట పడలేదని, ఎవరితోనూ అనిపించుకోలేదని చెప్పారు. తాను ఎక్కడ ఉన్నా క్రమశిక్షణతో, విధేయురాలిగా పనిచేశానని తెలిపారు. పార్టీ అవకాశం ఇస్తే, నియోజకవర్గ ప్రజలు ఆశీర్వదిస్తేనే ఎమ్మెల్యేగా అసెంబ్లీకి వచ్చానని స్పష్టంచేశారు. తన నియోజకవర్గానికి సంబంధించిన సమస్యల గురించి తప్ప మరే విషయం మాట్లాడలేదని, తాను మాట్లాడేది బాగా లేకపోతే అధికార పక్షం అభ్యంతరం వ్యక్తంచేయాల్సి ఉండెనని పేర్కొన్నారు. 'ప్రొటోకాల్ ఉల్లంఘనపై నేను ఫిర్యాదు చేస్తే, కలెక్టర్‌ను పిలిచి స్పీకర్‌గా మీరే విచారించారు. ఈ సభ అందరిది. ఇలాంటిది సభా సంప్రదాయాలకు మంచిదికాదు. సభ్యుల హక్కులను కాపాడాల్సిన బాధ్యత సభాపతిదే. నన్ను ఉద్దేశించి మాట్లాడిన మాటలు సబబుగా అనిపిస్తే రికార్డుల్లో ఉంచండి, లేదంటే తొలగించండి' అంటూ స్పీకర్‌ను సునీతా లక్ష్మారెడ్డి కోరారు.

మీ మనసుకు బాధేస్తే ఉపసంహరించుకుంటున్నా: స్పీకర్

సునీతాలక్ష్మారెడ్డి వ్యాఖ్యలపై స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సభలో స్పందించారు. సునీతాలక్ష్మారెడ్డి మనసును బాధించి ఉంటే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నానని స్పీకర్ సభలో ప్రకటించారు. తనకు ఎనిమిది మంది సోదరీమణులు ఉన్నారని, తనకు మహిళలన్నా, సునీతాలక్ష్మారెడ్డి అన్నా ఎనలేని గౌరవమని చెప్పారు. సభ్యులు రన్నింగ్ కామెంటరీ చేయడంతో 'నాకే వినబడటంలేదు. మీకు వినబడుతున్నదా?' అన్న కోణంలోనే అన్నానే తప్ప తనకు మరే దురుద్దేశం లేదని చెప్పారు. రన్నింగ్ కామెంటరీ నేపథ్యంలోనే తాను అలా స్పందించాల్సి వచ్చిందని స్పీకర్ వివరించారు. దీంతో వివాదం సద్దుమణిగింది.

సునీతా లక్ష్మారెడ్డికి మైక్ ఇవ్వండి

మంగళవారం అసెంబ్లీ ప్రారంభమైన వెంటనే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డికి మాట్లాడేందుకు మైక్ ఇవ్వాలని ఆ పార్టీ సభ్యులు కేటీఆర్, హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, మల్లారెడ్డి తదితరులు డిమాండ్ చేశారు. స్పీకర్ డిమాండ్స్‌ను ప్రవేశపెట్టిన తర్వాత మంత్రులు వాటిపై మాట్లాడుతున్నంతసేపూ అసెంబ్లీలో మైక్ కోసం బీఆర్‌ఎస్ పక్షం మౌనంగా నిరసన తెలిపింది. అనంతరం స్పీకర్ సునీతా లక్ష్మారెడ్డికి మైక్ ఇవ్వడంతో ఆమె తన ఆవేదన వ్యక్తంచేశారు.

ధృతికి రూ.కోటి నజరానా ఇవ్వాలి

- అందాల పోటీ కాదు.. ఒలింపిక్స్ నిర్వహించాలి
- అసెంబ్లీలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి డిమాండ్

హైదరాబాద్, మార్చి 25 (నమస్తే తెలంగాణ): అండర్-19 వరల్డ్ కప్ గెలిచిన జట్టులో ఉన్న రాష్ట్ర క్రీడాకారిణి ధృతికి ప్రభుత్వం రూ.కోటి ప్రోత్సహకంగా ఇవ్వాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి డిమాండ్ చేశారు. త్రిష, ధృతి రాష్ట్రం తరఫున దేశానికి ప్రాతినిధ్యం వహించారని గుర్తుచేశారు. త్రిషకు రూ.కోటి ఇచ్చిన ప్రభుత్వం, ధృతికి రూ.10 లక్షలు ఇవ్వడం సరికాదని చెప్పారు. వరల్డ్ కప్ ప్రైజ్ మనీని కూడా జట్టులోని 15 మందికి సమానంగా పంచుతారని గుర్తుచేశారు. ఒకరికి ఇచ్చి మరొకరికి ఇవ్వకపోవడం సరికాదని పేర్కొన్నారు. హుజూరాబాద్‌లో స్పోర్ట్స్ గ్రౌండ్ నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని కోరారు. కాంగ్రెస్, బీజేపీలకు చెరో 8 మంది ఎంపీలు ఉన్నారని, రాష్ట్రం నుంచి రూ.1.50 లక్షల కోట్లు, కేంద్రం నుంచి రూ.1.50 లక్షల కోట్లు తీసుకొచ్చి రూ.3 లక్షల కోట్లతో ఒలింపిక్స్ నిర్వహించాలని సూచించారు. హైదరాబాద్‌లో అందాల పోటీలు కాదని, ఒలింపిక్స్ నిర్వహిస్తే ప్రపంచవ్యాప్తంగా తెలంగాణకు గుర్తింపు వస్తుందని చెప్పారు.

ప్రభుత్వ స్కూళ్లను అమ్మేస్తారా?

ప్రభుత్వాన్ని ప్రశ్నించిన బీజేపీ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 25 (నమస్తే తెలంగాణ): వేలం ద్వారా ప్రభుత్వ స్కూళ్లను అమ్మేస్తారా? ప్రభుత్వం వద్ద అలాంటి ప్రణాళిక ఏమైనా ఉందా? అని బీజేపీ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మంగళవారం అసెంబ్లీలో విద్యాశాఖ పద్దుపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే 7,800 స్కూళ్లు మూతపడ్డాయని, వీటిని ఏం చేయబోతున్నారని ప్రశ్నించారు. అదేవిధంగా ప్రభుత్వ స్కూళ్లలో నిరుడు 3.5 లక్షల మంది డ్రాప్ అవుట్ అయినట్టు తెలిపారు. 1,931 స్కూళ్లలో జీరో ఎన్‌రోల్‌మెంట్ ఉన్నదని వాపోయారు.

ఆస్తిపన్నుపై వడ్డీలో 90% రాయితీ

యూఎల్‌బీఎస్‌లోనూ ఓటీఎస్

హైదరాబాద్, మార్చి 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఆస్తిపన్నుపై వన్‌టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చింది. గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ)లో ఈ ఏడాది నుంచే ఓటీఎస్ పథకాన్ని అమలుచేస్తున్నారు. ఇప్పుడు జీహెచ్‌ఎంసీ తరహాలో అర్బన్ లోకల్ బాడీస్ (యూఎల్‌బీఎస్)లోని పన్ను చెల్లింపుదారులు ఆస్తిపన్ను బకాయి మొత్తం ఒకేసారి చెల్లిస్తే వడ్డీలో 90% రాయితీని కల్పించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి అంటే ఈ నెల 31 వరకు ఆస్తిపన్ను బకాయిలపై 10% వడ్డీ మాత్రమే చెల్లిస్తే సరిపోతుందని, ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

500 కూడా ఖర్చు పెట్టలేకపోతున్నాం

- ఫ్రీ బస్సుతో మహిళలు రూ.5వేల కోట్లు సేవ్ చేశారు
- మ్యానిఫెస్టో అమలుకు ఇంకా టైమున్నది : ఎమ్మెల్యే యెన్నం

హైదరాబాద్, మార్చి 25 (నమస్తే తెలంగాణ): అభివృద్ధి పనులపై ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం రూ.500 కూడా ఖర్చు పెట్టలేని పరిస్థితి నెలకొన్నదని కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి స్పష్టంచేశారు. విద్య, రోడ్లు భవనాలతోపాటు పలు శాఖలకు సంబంధించి బడ్జెట్ పద్దులపై అసెంబ్లీలో మంగళవారం కొనసాగిన చర్చలో ఆయన మాట్లాడుతూ.. ఫ్రీ బస్సుతో మహిళలు ఇప్పటికే రూ.5 వేల కోట్లు సేవ్ చేశారని, వాటిని ఇంటి ఖర్చులు, పిల్లల కోసం వెచ్చిస్తున్నారని తెలిపారు. మ్యానిఫెస్టోలో పెట్టిన అంశాలను పదే పదే ప్రస్తావిస్తున్నారని, నిధుల లేమితో మ్యానిఫెస్టో అమలుకు ఆలస్యమవుతుందని వెల్లడించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు కొన్ని ప్రైవేట్ కాలేజీల జేబుల్లోకే వెళ్తున్నాయని, దానిపై చర్చిస్తామని వెల్లడించారు.

70 బార్లకు అనుమతి ఎలా ఇస్తరు?

- మద్యం ఆదాయంపై ఆధారపడలేదు అంటూనే ఇలాంటి నిర్ణయాలా?
- ప్రభుత్వంపై బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు ఆగ్రహం

హైదరాబాద్, మార్చి 25 (నమస్తే తెలంగాణ): మద్యం ఆదాయంపై ఆధారపడటం లేదంటూనే.. కొత్తగా 70 బార్లకు అనుమతి ఎలా ఇస్తారని బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మంగళవారం అసెంబ్లీలో ఎక్సైజ్, టూరిజం పద్దుపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇప్పటికే 1,171 బార్లు ఉన్నాయని, కొత్తగా ఎలైట్ బార్లు, మైక్రో బ్రూవరీస్‌ను ప్రభుత్వం ప్రారంభించాలనుకోవడం దారుణమన్నారు. మద్యం అమ్మకంతో ప్రభుత్వానికి రూ.27,623 కోట్ల ఆదాయం సమకూరుతున్నట్టు తెలిపారు.

ఆయన పేరేంటి? : ప్యానల్ స్పీకర్ రేవూరి

హరీశ్‌బాబు 'సంఘటన్ మే శక్తి హై' అని జూపల్లి కృష్ణారావు అన్నారని చెబుతుండగా.. ప్యానల్ స్పీకర్ కల్పించుకొని సబ్జెక్టుపై మాట్లాడాలని సూచించారు. హరీశ్‌బాబు పేరు మర్చిపోయిన ప్యానల్ స్పీకర్ రేవూరి, పక్కనే ఉన్న వ్యక్తిని అడిగి పేరు తెలుసుకున్నారు.